www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 3 డిసెంబర్ 2023

ఖరీఫ్ సాగులో అధిక దిగుబడి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఖరీఫ్ సీజన్‌లో వరి పంట అధిక దిగుబడి సాధించిందని మండల వ్యవసాయ అధికారి ఎం.విశ్వాసరావు అన్నారు. శనివారం ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో వరి దిగుబడి గత కాలం కంటే సరాసరి సుమారు ఎకరానికి 10 బస్తాలు అధికంగా దిగుబడి లభించినట్లు తెలిపారు. శనివారం నుంచి రైతులకు ఎకరాకు 75 కేజీల సంచులు, పది సంచులు అధికంగా సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. మండలంలో 60 శాతం వరి కోతలు పూర్తయ్యాయన్నారు. ఈ సందర్భంగా రానున్న రబీ సీజన్‌కు సంబంధించి రైతులు వరి నాట్లు తొందరగా పూర్తి చేయాలన్నారు.

కలవర పెడుతున్న తుపాను

▸ అల్పపీడనం తుపానుగా మార్పు ▸ జిల్లాలో 60 శాతమే కోతలు పూర్తి ▸ వరి పంట కోసిన రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

తుఫాను రాకతో అన్నదాతలో ఆందోళన వ్యక్తమవుతోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడి అనంతరం తుఫాన్‌గా మారిన విషయం విధితమే. దీంతో సోమ, మంగళవారాల్లో ఈదురు గాలులతో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరించింది. అయితే రెండు రోజుల ముందుగానే శనివారం మధ్యాహ్నం నుంచే వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. దీంతో రైతులు అప్రమత్తమయ్యారు. ముందుగా కోసిన రైతులు ఇప్పటికే కుప్పలు వేశారు. రెండు, మూడు రోజుల క్రితం కోత కోసిన పొలాల్లో వరి పనలు ఇంకా పూర్తిగా ఎండలేదు. అలాగని పొలంలోనే ఉంచితే పనలు తడిసిపోయి ధాన్యం మొలకెత్తే పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో ఆదరాబాదరాగా కుప్పలు వేసి బరకాలు కప్పటం లేదా సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధమవట కనిపించింది.

జిల్లా వ్యాప్తంగా 1.75 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. 1.07 లక్షల ఎకరాల్లో కోతలు పూర్తయినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. సుమారు 3 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి వచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకూ ప్రభుత్వం 90 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగా, వ్యాపారులు మరో 60 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారని మిగిలిన 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్దనే ఉందని అధికారులు అంచనాగా చెబుతున్నారు. అయితే ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు రైతులకు సౌకర్యాలు కల్పించలేదు. మరోవైపు మిగిలిన 68 వేల ఎకరాల్లో కోతలు పూర్తి కాలేదు. రెండు మూడు రోజుల్లో వరి కోతలు మొదలుపెడదామని వేచిచూసిన రైతులకు ప్రస్తుతం బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుఫాన్‌గా మారటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే వాతావరణ పరిస్థితుల దృష్టా కోతలు వాయిదా వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే నిల్వ ఉన్న ధాన్యాన్ని త్వరతగతిన జిల్లాలోని రైస్ మిల్లులకు తరలించాలని అధికారులు చెబుతున్నారు. రవాణాకు ఎటువంటి సౌకర్యాలు కల్పించలేదు. ఈ ఏడాది ఖరీఫ్ సాగు ఆద్యంతం ఇబ్బందులు నడుమ కొనసాగింది. అధికార యంత్రాంగం ముందస్తు సాగుకు చేయాలని జూన్ 1 తేదీన సాగు నీరు విడుదల చేసింది. అయితే తొలకరి ఆలస్యం కావటంతో సాగు ఆలస్యంగా ప్రారంభమైంది. మరోవైపు వర్షాలు పూర్తిగా ముఖం చాటేయడంతో నీటి ఎద్దడి తలెత్తింది. రైతులు బోర్లు, విద్యుత్ మోటార్ల సహాయంతో వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంట పండించారు. వ్యయ, ప్రయాసల అనంతరం ఎట్టకేలకు పంట చేతికొచ్చింది. దీంతో నవంబరులో కోతలు ప్రారంభం అయ్యాయి. ప్రస్తుతం దిగుబడులు చేతికొచ్చినా తుఫాను భయం వెంటాడుతోంది. అధికారుల అంచనాల ప్రకారం గత నెలాఖరుకే కోతలు కావాల్సి ఉంది. ఆచరణలో పూర్తి కాలేదు. ఇంతలోనే మరో సారి తుఫాను రావటంతో గుబులు మొదలైంది. వర్షాభావ పరిస్థితులు, తెగుళ్లబారి నుంచి వరిపైరును కాపాడుకున్నామని, పంట చేతికి వచ్చే తరుణంలో అకాల వర్షాలు దెబ్బతీస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రైతులు అప్రమత్తం కావాలి

తుఫాన్ నేపథ్యంలో వరి రైతులు అప్రమత్తంగా ఉండాలి. ఈ నెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. పొలాల్లో నుంచి వర్షపు నీరు బయటకు పోవడానికి కాలువలు ఏర్పాటు చేసుకోవాలి. వర్షాలకు చేను ఒరిగి ధాన్యం తడవటం, మునిగిపోవటం వంటివి పరిస్థితులు ఎదురైతే గింజ మొలకెత్తకుండా 5 శాతం ఉప్పుద్రావణం పిచికారి చేసుకోవాలి. మండల వ్యవసాయాధికారులు, రైతు భరోసా కేంద్రాల సిబ్బందిని ఇప్పటికే అప్రమత్తం చేశాం.

-ఎస్ మాధవరావు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటే కీలకం

'స్వీప్'పై అవగాహన సదస్సులో కలెక్టర్

ప్రజాశక్తి - నిడదవోలు

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటే కీలకమని, కావున ఓటు హక్కు లేని ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పిలుపునిచ్చారు. శనివారం నిడదవోలు ఎస్‌వి దుర్గాంబ ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఎన్నికలు, ఓటు హక్కు, ఏ విధంగా నమోదు చేసుకోవాలి? పిఎస్ అంటే ఏమిటి? బిఎల్ఒ అంటే ఎవరు? అనే అంశాలపై ఆవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే ఉద్దేశంతో స్వీప్ కార్యక్రమాన్ని డిసెంబర్ 2, 3 శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు గుర్తింపు, నమోదును పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేయడం జరిగింద న్నారు. బిఎల్ఒ అంటే బూత్ స్థాయి అధికారి అని ఆ పోలింగ్ కేంద్రం పరిధిలో ఉన్న ఓటర్లను గుర్తించి, వారికి ఓటు హక్కు కలుగ చేయడం వారి బాధ్యత అని అన్నారు. అర్హత కలిగి ఉండి ఇంకా ఓటు లేని వారు ప్రత్యేక శిబిరాలు వద్దకు వచ్చి వారికి ఓటు ఉందో లేదో సరి చూసుకోవాలన్నారు. ఇప్పటికే 18 ఏళ్ళ నిండి ఇంకా ఓటు హక్కు లేకపోయినా, 2024 జనవరి ఒకటవ తేదీ నాటికి 18 ఏళ్ళ నిండే వాళ్ళు ముందస్తుగా ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఫారం 6 ద్వారా కొత్త ఓటరు నమోదు, ఫారం 6 బి ద్వారా ఓటరు గుర్తింపు కార్డు కి ఆధార్ అనుసంధానం, ఫారం 7 ద్వారా మరణించిన వారి పేర్లు తొలగింపు, వేరొక నియోజక వర్గంకి, రాష్ట్రానికి బదలీ అయితే తొలగింపు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఫారం 8 ద్వారా అక్షర దోషాలు, ఫోటో మార్పు, డోర్ నంబర్ మార్పు, వేరే పోలింగ్ కేంద్రానికి మార్పు వంటివి చేసు కునే అవకాశం ఉందన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపుదిద్దడం జరుగుతోందని, డిసెంబర్ 9లోగా ఓటరు నమోదు కార్యక్రమం జరుగుతుందని, ఆ మేరకు ఓటు హక్కు లేని వారు ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా ఓటరుగా నమోదు కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిడదవోలు పట్టణంలోని జడ్‌పి బాలికోన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని, నగరంలోని నిడదవోలు సచివా లయం 8లోనూ, మహిళా డిగ్రీ కళాశాలలో జరుగుతున్న ప్రత్యేక శిబిరాన్ని కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ పర్యట నలో ఆర్‌డిఒ కృష్ణ నాయక్, నిడదవోలు ఇఆర్ఒ ఎం.ఝాన్సీరాణి, తహశీల్దార్ ఎం.గంగరాజు, మునిసిపల్ కమిషనర్ కెవి.పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని పాలంగి గ్రామంలో అభ్యుదయ రజక జన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన గంగాలమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి శనివారం కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయాన్ని త్వరితగతిన పూర్తి చేసేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొక్కా శ్రీనివాస్, వైసిపి నాయకులు పాలాటి శరత్ తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న ఎంపిపి యల్లారీశ్వరి

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - దేవరపల్లి

ఓటు నమోదు స్పెషల్ క్యాంపెయిన్ సందర్భంగా మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ ఎం.రామకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారికి కొత్త ఓటు నమోదు, మార్పులు చేర్పుల కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బిఆర్ కృష్ణంరాజు, డిప్యూటీ తహశీల్దార్ ఎం.శ్రీనివాస్, బిఎల్ఒలు పాల్గొన్నారు.

బెంచీలను బహూకరించిన గుబ్బల

సిమెంటు బెంచీలు బహూకరించిన స్వర్ణాంధ్ర

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రజల సౌకర్యార్థం హౌసింగ్ బోర్డ్ కాలనీలో స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిర్వాహకులు లయన్. డాక్టర్ గుబ్బల రాంబాబు సొంత నిధులతో బెంచీలను ఏర్పాటు చేయడం అభినందనీయమని హౌసింగ్ బోర్డ్ పూర్వపు సర్పంచ్ మెట్ల ఏసు పాదం ప్రశంసించారు. సచివాలయం 1, 2, 500 బస్టాప్ వద్ద విజయేశ్వర కాలనీ, ఇండస్ట్రియల్ కాలనీ, లాలాచెరువు మొదలగు ప్రాంతాల్లో రూ.54 వేల వ్యయంతో 16 సిమెంట్ బెంచీలను రాంబాబు ఏర్పాటు చేశారు. జీవిత బీమా ఉద్యోగుల సంఘం కార్యదర్శి సమ్మెతం. గన్నయ్య మాట్లాడుతూ నగరంలో జరిగే అనేక సేవా కార్యక్రమంలో స్వర్ణాంధ్ర రాంబాబు తన వంతు సహకారం అందిస్తూ సమాజానికి సేవలు అందిస్తు న్నారని కొనియాడారు. స్వర్ణాంధ్ర నిర్వా హకులు రాంబాబు మాట్లాడుతూ హౌసింగ్ బోర్డ్ కాలనీ లాలాచెరువు ప్రాంతాల్లో ఇప్పటివరకు సుమారు వందకు పైబడి బెంచీలు ప్రజల అవసరార్థం వివిధ ప్రాంతాలలో, పార్కులలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు భాస్కర్ అమర్నాథ్, శ్రీనివాస్ కిషోర్, స్వర్ణాంధ్ర మేనేజర్ వై.హరికృష్ణ, ఎండి.ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

అధికారం వచ్చాక అందరికీ న్యాయం

▸ పాదయాత్రలో నారా లోకేశ్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి, యంత్రాంగం

పిఠాపురం టిడిపి అధికారంలోకి వచ్చాక అన్ని సామాజిక తరగతులకూ న్యాయం చేస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. శనివారం యువగళం పాదయాత్ర కాకినాడ రూరల్ నియోజకవర్గం నుంచి మొదలై పిఠాపురం నియోజకవర్గంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో వివిధ సామాజిక తరగతులకు చెందిన వారు, ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్, మెకానిక్స్ తదితరులు తమ సమస్యలపై లోకేష్‌కు వినతిపత్రాలు అందించారు. ఆయనతో సెల్ఫీలు దిగారు. కుక్కుటేశ్వరస్వామి ఆలయం సెంటర్‌లో ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులు లోకేష్‌కు వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు టీచర్స్, లెక్చరర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. సిఎం వైఎస్.జగన్ విద్యారంగాన్ని పూర్తిగా భ్రష్టుపట్టించారని లోకేష్ విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రైవేటీ టీచర్లు, లెక్చరర్లకు ప్రభుత్వ పథకాలు వర్తించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వాసుపత్రి వద్ద బిసిలతో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ 10 శాతం తగ్గించడంతో 16,500 మంది బిసిలు పదవులకు దూరమయ్యారన్నారు. రూ.75,760 కోట్ల సబ్ ప్లాన్ నిధులను దారిమళ్లించి అన్యాయం చేశారన్నారు. అంబేద్కర్ సెంటర్‌లో ఎస్‌సిలు వినతిపత్రం అందించారు. జగన్ రద్దు చేసిన 27 దళిత సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని కోరారు. కాకినాడలో డ్రైవర్ సుబ్రహ్మణ్యంను దారుణంగా హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఎంఎల్‌సి అనంతబాబును జగన్ వెంటేసుకుని తిరుగుతున్నారన్నారు. పిఠాపురం పాతబస్టాండులో మోటారు మెకానిక్స్ సంక్షేమ సంఘం ప్రతినిధులు కలిసి వినతిపత్రం ఇచ్చారు. నియోజకవర్గ పరిధిలోని పిఠాపురం, యు.కొత్తపల్లి మండలంలో ఉప్పాడ వరకు పాదయాత్ర సాగింది.

కౌలు రైతుల సమస్యలపై వినతి

రాష్ట్రంలోని కౌలు రైతుల సమస్యలపై లోకేష్‌కు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్రంలో కోటీ 20 లక్షల మంది కౌలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. వ్యవసాయంలో ఖర్చులు అధికం కావడం వల్ల భూ యజమానులు భూమిని వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్లి వ్యాపార రంగంలో స్థిరపడుతున్నారన్నారు. కూలి, నాలి చేసుకునే ఎస్‌సి, బిసి, ఒలు కౌలు వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. అటువంటి కౌలు రైతులకు రెక్కల కష్టం మిగలడం లేదని అన్నారు. ఈ కాలంలో పెరిగిన ధరలు, గిట్టుబాటు ధర లేకపోవడం కౌలు రైతులకు అప్పులే మిగులుతున్నాయన్నారు.

పిఠాపురంలో పాదయాత్రలో పాల్గొన్న లోకేష్

సామర్లకోటలో ధాన్యం మాల

పామాయిల్ రైతుల వినతి

సామర్లకోట రూరల్‌లో నారా లోకేష్‌కు తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి శ్రీనివాసాచార్యులు చౌదరి ఆధ్వర్యంలో 75 కిలోల ధాన్యంతో భారీ గజమాలతో స్వాగతం పలికారు. రైతుల సమస్యలపై వివరించారు. పామాయిల్ రైతుల అసోసియేషన్ అధ్యక్షుడు పెండ్యాల బుజ్జి ఆధ్వర్యంలో తమ సమస్యలపై లోకేష్‌కు వినతిపత్రం అందించారు. పవర, పండ్రవాడలో ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో మహిళలు లోకేష్‌కు హారతులు పట్టారు. నిమ్మకాయల రంగనాగ్, పాలకుర్తి శ్రీనుబాబు, అడబాల కుమారస్వామి, తోటకూర శ్రీనివాసు, రాజా సూరిబాబు రాజు, గుణ్ణం చంద్రమౌళి, జనసేన పెద్దాపురం ఇన్చార్జ్ తుమ్మల రామస్వామి, కంటే జగదీష్ మోహన్ పాల్గొన్నారు.

యు.కొత్తపల్లి పిఠాపురం నియోజకవర్గంలో నారా లోకేష్ బహిరంగ సభను రద్దు చేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితి కారణంగా వచ్చిన అభిమానులకు సెల్ఫీలు తీసుకునే విధంగా అవకాశం కల్పించారు పిఠాపురం నుంచి నవకండ్రవాడ, కొండవరం, మీదగా ఎండపల్లి జంక్షన్‌కు లోకేష్ చేరుకుని అక్కడ బస చేయనున్నారు.

జైలులో ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

సెంట్రల్ జైల్లో జిల్లా న్యాయమూర్తి తనిఖీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రరం సెంట్రల్ జైలును జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత శనివారం సందర్శించారు. కారాగారంలోని ఆసుపత్రిని, అక్కడ ఉన్న వైద్య సదుపా యాలను పరిశీలించారు. వంటశాలను, ఆహార ప్రమా ణాలను పరిశీలిం చారు. ఖైదీల కోసం ఏర్పాటు చేసిన నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని సందర్శించారు. వెల్డింగ్, ఇతర శిక్షణల్లో శిక్షణ పొందుతున్న ఖైదీలతో మాట్లాడారు. విడుదలైన తరువాత జీవనోపాధి కోసం ఈ శిక్షణ ఉపాయోగకరంగా ఉంటుందని అన్నారు. ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నియమించిన పారా లీగల్ వాలంటీర్లతో మాట్లాడారు. ఖైదీలకు అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సేవల గురించి అందరికీ వివరించాలని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు సంస్థ దృష్టికి తీసుకురావాలని సూచించారు. మహిళా కారాగారాన్ని సందర్శించి వసతులను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి కేసు వివరాల గురించి తెలుసుకున్నారు. ఎలాంటి న్యాయ సహాయం కావాలన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలన్నారు. కారాగార వైద్య సిబ్బందితో మాట్లాడి ఖైదీల ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. పరిశీలనలో భాగంగా ఖైదీలతో కలిసి భోజనం చేశారు.

కార్యదర్శులకు క్రీడా కిట్లు అందజేత

కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపిపి, ఎంపిడిఒ

ప్రజాశక్తి - పెరవలి

ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల కోసం క్రీడా కిట్లను పంపిణీ చేశారు. స్థానిక ఎంపిపి సమావేశం హాల్లో శనివారం ఎంపిపి కార్చెర్ల సీతారామ ప్రసాద్, ఎంపిడిఒ సింగంశెట్టి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంబంధిత క్రీడా కిట్లను ఆయా ప్రాంతాల కార్యదర్శులకు అందించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు బి.స్వరూప్, షేక్ సుర్జహాన్, ఇఒపిఆర్‌డి వెంకటరమణ, ఉపాధ్యాయులు జేమ్స్, పుల్లపురాజు, రమేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్టూ 'నిజం'



కడియం అభివృద్ధికి నిరంతరం కృషి

ప్రజాశక్తి - కడియం

తన కుటుంబ రాజకీయ నేపథ్యానికి పునాది నాటి కడియం నియోజ కవర్గమని, నియోజవర్గాలు వేరైనా వాటిలో భాగమైన గ్రామాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాజానగరం నియోజకవర్గ ఎంఎల్ఎ జక్కంపూడి రాజా అన్నారు. కాపు సంఘం విరాళాలతో వేమగిరిలో నిర్మించిన హిందూ స్వర్గ ధామం నూతన భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. కడియం నియోజకవర్గానికి, తన కుటుంబానికి విడదీయరాని బంధమన్నారు. తన తండ్రి జక్కంపూడి రామ్మోహనరావు ఇదే నియోజకవర్గం నుంచి రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. అటువంటి కడియం అభివృద్ధికి తన వంతు సహకారం అందించడానికి ఎల్లప్పుడూ ముందుం టానని అన్నారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి తన తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయన్నారు. ప్రజా విరాళాలతో అతిపెద్ద స్వర్గధామం భవనాన్ని నిర్మించిన కాపు సంఘం పెద్దలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ ఆకుల వీర్రాజు, రంకిరెడ్డి సుబ్బరాజు, కోలా వెంకటరాజు, డాక్టర్ వెలుగుబంటి వెంకటాచలం, పులుపు ఆదినారాయణ, వెలుగుబంటి అచ్యుతరాం, సూరపరెడ్డి జానకిరామ్, అక్కిన ఆనందబాబు, తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనం ప్రారంభోత్సవంలో ఎంఎల్ఎ జక్కంపూడి

తిరుమల అధినేత తిరుమలరావుకి పితృవియోగం

తండ్రి అంత్యక్రియల్లో తిరుమలరావు, సోదరులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం రూరల్ కాతేరు గ్రామంలోని తిరుమల విద్యాసంస్థల అధినేత నున్న తిరుమలరావు తండ్రి నున్న చంద్రశేఖర్‌రావు (92) శనివారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వారిలో నున్న తిరుమలరావు, నున్న కృష్ణ, నున్న సురేష్ మరియు కుమార్తె హేమలత పద్మావతి, చంద్రశేఖర్ రావు వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చినా వారి పిల్లలను ఎంతో ఉన్నతులుగా తీర్చిదిద్దారు. తన పెద్ద కుమారుడైన నున్న తిరుమలరావు తిరుమల విద్యాసంస్థలను స్థాపించి నేడు ఎంతో మందికి విద్యను అందిస్తున్నారు. చంద్ర శేఖర్‌కి ఎంతో సుపరిచితులైన రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి, పలువురు ప్రముఖులు, తిరుమల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు గ్రామస్తులు ఆయన పార్థివదేహానికి నివాళులు అర్పించారు.

నైపుణ్య పోటీలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రపంచ నైపుణ్యాల పోటీలు 2024లో భాగంగా, ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ - జాతీయ నైపుణ్యాభివృద్ధి సహకారంతో భారతదేశ నైపుణ్యాల పోటీ 2023ను నిర్వహిస్తోందని, ఈ పోటీల్లో పాల్గొనేవారు డిసెంబర్ 20 వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ ఓ ప్రకటనను విడుదల చేశారు. దరఖాస్తుల నమోదు కోసం engine ering.apssdc.in/worldskillsapను సందర్శించి ఆసక్తి కలిగి ఉన్న వారు వారి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. జిల్లా నుంచి ఈ పోటీల్లో యువత పాల్గొనడానికి మరింతగా ప్రోత్సహించండం జరుగుతోందని అన్నారు. జిల్లా నుంచి ఇప్పటి వరకూ 810 మంది వారి పేర్లు నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. భారత నైపుణ్య పోటీలు -2023లో భాగంగా టూరిజం అండ్ హాస్పిటాలిటీ కేటగిరీలో రెస్టారెంట్ సర్వీస్, వంటలు, బేకరీ, హోటల్ రిసెప్షన్ కేటగిరీలలో, మీడియా మరియు వినోదం విభాగంలో గ్రాఫిక్ డిజైన్ టెక్నాలజీ, 3డి - డిజిటల్ గేమ్ కళ, పరిశ్రమ 4.0 వర్షన్ కేటగిరీలో, పెయింట్స్ అండ్ కోటింగ్‌లు విభాగంలో పెయింటింగ్ మరియు అలంకరణ కేటగిరీలలో నూతన ఆవిష్కరణలు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ తరహా ఈవెంట్‌లలో 40 విభిన్న ట్రేడ్‌లలో వృత్తి నైపుణ్యాలలో నైపుణ్యాన్ని ప్రదర్శన చేసుకునేందుకు ఇది చక్కటి వేదిక అన్నారు.ఈ అవకాశాన్ని జిల్లాకు చెందిన ఔత్సాహిక యువ పారిశ్రామిక వేత్తలు, యువత సద్వినియోగం చేసుకోవాలనికోరారు. ఈ పోటీలలో అత్యుత్తమ పనితీరుకు బెంచ్‌మార్క్‌గా మాత్రమే కాకుండా వృత్తి నైపుణ్యాన్ని అంచనా వేయడానికి భవిష్యత్‌కు ఒక లక్ష్య సాధనానికి ఎంతో మేలు చేకూరుతుందన్నారు.

పొలిటికల్ అటెన్షన్...

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ఓ వైపు జిల్లాలో వేగంగా మారుతున్న రాజకీయ పరిణామాలు, మరోవైపు తెలంగాణాలో జరిగిన ఎన్నికల ఫలితాలు ఉత్కంఠ నెలకొంది. తెలుగుదేశం పార్టీ యువనేత నారా లోకేష్ చేపట్టిన యువగళం కార్యక్రమం కోనసీమ జిల్లా నుంచే పున్ణప్రారంభించిన విషయం విధితమే. స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్లో అక్రమాలు జరిగాయని ఆరోపణలతో ఆ పార్టీ అధినేత చంద్రబాబును రిమాండ్‌కు తరలించడంతో యువగళం తాత్కాలికంగా బ్రేక్ పడింది. అనంతరం చంద్రబాబుకు బెయిల్ రావటం, రోజుల వ్యవధిలోనే యువగళం ప్రారంభించడంతో టిడిపి శ్రేణులలో నూతన ఉత్సాహాన్ని నింపింది. అదే స్థాయిలో అధికార పార్టీలోనూ మంత్రులు రాక, సభలు సమావేశాలు నిర్వహణతో పార్టీ శ్రేణులను ఆకట్టుకునే ప్రయత్నం జరుగుతోంది. రాబోయే ఎన్నికలే లక్ష్యంగా పావులు కదుపుతున్నాయి. అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి నిర్వహించే బహిరంగ సభలు విమర్శలు, ప్రతి విమర్శలతో హోరెత్తుతున్నాయి. కొన్ని సందర్భాల్లో వ్యక్తిగత విమర్శలు సైతం పాల్పడటం సాధారణ ప్రజలను విస్తుపోయేలా పుతోంది. తెలంగాణలో ఎన్నికల ఫలితాలు నేడు విడుదల కానున్న విషయం విధితమే. ఈ నేపథ్యంలో గెలుపు ఓటముల పై జిల్లాలోనూ జోరుగా చర్చ జరుగుతుంది. తెలంగాణలో ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది.

అధికారులు సమాయత్తం

రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు అధికార యంత్రాంగం చకచకా ఏర్పాట్లు పూర్తి చేస్తుందా..? అంటే ఔననే సమాధానం వినిపిస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇప్పటికే ఓటర్ల జాబితాను ప్రకటించిడం, అభ్యంతరాలను స్వీకరించడం వంటి కీలక కార్యక్రమాలు నిర్వహించిన విషయం విధితమే. మరోవైపు కొత్త ఓట్లు నమోదుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి యువతను ఓటర్లుగా చేర్పుతున్నారు. రిటర్నింగ్ అధికారుల కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. అధికార, ప్రతిపక్ష పార్టీలతో ఉన్నతాధికారులు సమావేశాలు నిర్వహించడంతోపాటు రాబోయే ఎన్నికల విధులతో ప్రత్యక్ష సంబంధం ఉన్న పలువురు అధికారులు, ఉద్యోగుల బదిలీలను కసరత్తు ప్రారంభం అయ్యాయి. ఓటింగ్ నిర్వహణకు బ్యాలెట్ యూనిట్లు (బియూ), ఓటర్ వెరి ఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వివిప్యాట్), కంట్రోల్ యూనిట్లు (సియు) రాష్ట్ర ఎన్నికల సంఘం పంపింది. బెంగళూరు బెల్ కంపెనీ నుంచి సరఫరా చేసిన 4930 వివి ప్యాడ్స్‌ను రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో భద్రపరిచేసి స్ట్రాంగ్ రూం గోడౌన్ డిపాజిట్ చేశారు. ఇప్పటికే ఫస్టలెవల్ కమిటీ (ఎఫ్ఎల్‌సి) పరిశీలన ప్రక్రియను సైతం పూర్తి చేశారు. అత్యంత కీలకమైన ఈవిఎం ప్యాట్‌లను ఎలాకాలువలోని స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు. సిసి కెమెరా, 24 గంటల పర్యవేక్షణతో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు.

ముందస్తు రబీ సాధ్యమేనా..?

జిల్లాలో ముందస్తుగా రబీ సాగు సాధ్యమేనా అనే ప్రశ్న తలెత్తుతోంది. అధికారుల సూచనల మేరకు ఈ నెల ఒకటో తేదీ నుంచే సాగుకు సిద్ధం కావాలని ఆదేశించారు. నీటి ఎద్దడి నేపథ్యంలో ప్రణాళికా బద్ధంగా సాగు చేపట్టకపోతే

ఇబ్బందులు తలెత్తే అవకాశాలు లేకపోలేదు. అయితే ఖరీఫ్ సాగుకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో ఇప్పటికి 50 శాతం మాత్రమే కోతలు పూర్తయ్యాయి. మిగిలిన 50 శాతం పూర్తయ్యేందుకు నెలాఖరు వరకూ సమయం పడుతుందని రైతులు, రైతు సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. మరో వైపు తుఫాను హెచ్చరిక రైతులను కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. ఆరుగాలం పండించిన పంట దిగుబడులను ఒబ్బిడి చేసుకునేందుకు రైతులు తంటాలు పడుతున్నారు. ఈ పరిస్థితులను అధిగమించి రైతులు తర్వాత పంటకు సిద్ధమయ్యేందుకు కనీసం నెల రోజుల వ్యవధి తప్పదు. సాగునీటి కేటాయింపులకు సంబంధించి అధికారులు ఏ మేరకు జాగ్రత్తలు తీసుకుంటారో వేచి చూడాలి.

ఆశావర్కర్ల పోరాటం విజయవంతం

శీలబోయిన దుర్గాదేవి కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆశా వర్కర్లు చేపట్టిన ఆందోళన విజయవంతమైంది. దుర్గాదేవి కుటుంబానికి న్యాయం చేయాలని సంఘం ఆధ్వర్యంలో 11 రోజులుగా దీక్షను చేపట్టడంతో అధికారులు దిగొచ్చారు. దుర్గాదేవి కుటుంబానికి ఉద్యోగం ఇస్తామని లిఖిత పూర్వక హామీని ఆశా వర్కర్ల ఉందోళనతో సాధించుకున్నారు.

నేరాలు ఘోరాలు

సారా తయారీ కేంద్రంపై దాడి

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని గుడ్డుగూడెంలో నాటు సారా తయారీ కేంద్రంపై ఎస్ఇబి అధికారులు శనివారం దాడి చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్ఇబి సిఐ డి.సుధా మీడియాకు వెల్లడించారు. ముందస్తుగా తమకు వచ్చిన సమాచారంతో ఎస్ఇబి ఎస్ఐ పి. సుధీర్, సిబ్బంది గుడ్డుగూడెంలో దాడులు నిర్వహించారు. ఈ దాడిలో తొక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన బొమ్మిడిసాము చిట్టిబాబును అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకవడంతోపాటు, 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. అలాగే 8 మంది పాత నేరస్తులను డిటి ముందు బైండోవర్ చేసినట్లు సిఐ తెలిపారు.

మోటార్ సైకిల్ చోరీపై కేసు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మోటార్ సైకిల్ చోరీపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని మెర్లపాలెం గ్రామానికి చెందిన చింతల శ్రీరాములు శుక్రవారం రాత్రి తన ఇంటి ముందు ఎప్పటిలాగే మోటార్ సైకిల్ పెట్టాడు. అయితే అతను ఉదయం లేచి చూసేసరికి లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని. భావించి శనివారం స్థానిక స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే రూ.లక్షలు విలువ చేసే వాహనాలను రోడ్లమీద పెట్టి నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా వీల్‌లాక్ వేసుకోవాలని ఎస్ఐ తెలిపారు.

20 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలోని పలు గ్రామాల్లో ఎస్ఇబి అధికారులు చేసిన దాడుల్లో 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని ముగ్గురి వ్యక్తులను అరెస్టు చేశారు. ప్రత్తిపాడు ఎస్ఇబి సిఐ పి.అశోక్ తెలిపిన వివరాలు. ఏలేశ్వరం మండలం సిరిపురం గ్రామంలో ఒక మహిళ వద్ద నుంచి 10 లీటర్లు, మరో మహిళ వద్ద నుంచి 5 లీటర్లు, వీరవరం గ్రామంలో ఒక వ్యక్తి నుంచి 5 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేశామన్నారు. అనంతరం అన్నవరం గ్రామంలో ఎస్‌వివి సత్యదేవ డిగ్రీ కళాశాల ఆవరణలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించి, ప్రమాణాలు చేయించడం జరిగిందన్నారు. ఈ దాడుల్లో ఎస్ఇబి ఎస్ఐ బి.శ్రీనివాసరావు, డిటిఎఫ్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకటేశ్వరరావు, ఇంటెలిజెన్స్ వింగ్ ఇన్‌స్పెక్టర్ కె.గిరిధర్, సిబ్బంది కృష్ణార్జున, దొరబాబు, వెంకటేశ్వరరావు, రామకృష్ణ, రాజు, రాంబాబు పాల్గొన్నారు.

కాపురానికి రాలేదని ఆత్మహత్య

ప్రజాశక్తి - ఉంగ్రాజవరం

భార్య కాపురానికి రాలేదని మనస్థాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పసలపూడి గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పసలపూడి గ్రామానికి చెందిన తీట్ల విశ్వేశ్వరరావు (38), భార్య రాణీల మధ్య గత కొంతకాలంగా మనస్పర్ధలు ఏర్పడి, ఇరువురు దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో భార్య కాపురానికి రానందున మనస్థాపం చెందిన విశ్వేశ్వరరావు శనివారం ఇంటి వద్ద పొలంలో వాడే గుళికలు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతిని తల్లి కృష్ణవేణి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ. కె.రామారావు తెలిపారు.

యానాం వార్తలు

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎఓ మునిస్వామి

తుపాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - యానాం

మిచాంగ్ తుపాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్ఎఓ మునిస్వామి సూచించారు. స్థానిక ఆర్ఎఓ ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో తుఫాన్ అంశంపై సమీక్షా సమావేశం శనివారం నిర్వహించారు. 20 మంది ఎన్‌డిఆర్ఎఫ్ బృందం యానం చేరుకుందని, మత్స్యకారులెవ్వరూ సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని సూచించారు. ఈ నెల 4న తీరం దాటుతున్న నేపథ్యంలో యనాంలో పాఠశాలలకు సెలవును పుదుచ్చేరి డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ పి.ప్రి యదర్శిని ప్రకటించారు. ఈ మేరకు సెలవును ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్ తెలిపారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న ఎల్‌పిజి గ్యాస్ వినియోగదారులు తమ వివరాలను ఆన్ లైన్ పోర్టల్లో నమోదు చేసుకోవాలని ఆర్ఎఓ మునిస్వామి తెలిపారు. యానాంలో కేవలం 3,900 మంది రేషన్‌కార్డు వినియోగదారులు మాత్రమే గ్యాస్ రాయితీకి నమోదు చేసుకున్నారన్నారు. మిగిలిన వారు వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.

స్థలాలు ఇవ్వకుంటే నిరవధిక నిరాహార దీక్ష

-వైసిపి ఎంపిపి సుంకర శ్రీవల్లి హెచ్చరిక

ప్రజాశక్తి - గోకవరం

గోకవరం దరిచేర్చి ఉన్న భూములను కొనుగోలు చేసి లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఎంపిపి సుంకర శ్రీవల్లి డిమాండ్ చేశారు. లేదంటే లబ్ధిదారుల కోసం నిరవధిక దీక్షకు వెనుకాడేది లేదని హెచ్చరించారు. తన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సిఎం జగన్మోహన్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా 31 లక్షల మందికి స్థలాలతోపాటు, గృహాలు నిర్మించాలని లక్ష్యంగా అడుగులు వేస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగానే గోకవరం గ్రామంలో సుమారు 1400 మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించడం జరిగిందని వివరించారు. వీరిలో సుమారు 600 మందికి గోకవరం నుంచి తంటికొండ వెళ్లే మార్గంలో భూమిని కొనుగోలు చేసి ఇవ్వడం జరిగిందని తెలిపారు. అయితే మిగిలిన 800 మంది లబ్ధిదారులకు అదే ప్రాంతంలో భూమి అందుబాటులో ఉన్నా అక్కడ కాదని గోకవరానికి సుమారు 4 కిలో మీటర్ల దూరంలో భూమిని కొనుగోలు చేసి ఇస్తామనడం దారుణమన్నారు. ప్రస్తుతం లబ్ధిదారులకు ఇచ్చిన ప్రాంతంలో ఎకర భూమి రూ.18 లక్షలకు ఇచ్చేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని, అయితే కృష్ణునిపాలెం సమీపంలో ఎకరాను రూ.25 లక్షలకు కొనుగోలు చేసి ఇచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ ప్రక్రియ కేవలం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసేదిగా ఉందన్నారు. ఇదే విషయంపై ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుబాటులో ఉన్న భూమిని కాదని, లబ్ధిదారులను ఊరికి దూరంగా భూమిని కొనుగోలు చేస్తామనడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. ఇదే విషయంపై మంత్రి వేణుగోపాలకృష్ణ, వైసిపి కో-ఆర్డినేటర్ మిధున్‌రెడ్డి, కలెక్టర్, జెసి దృష్టికి తీసుకెళ్లామని అయినా వారి నుంచి ఎటువంటి స్పందన లేకుండా పోయిందన్నారు. లబ్ధిదారుల కోసం చేస్తున్న తమ ప్రయత్నాన్ని అధికారులు అడ్డుకుం టున్నారా? లేక ప్రజాప్రతినిధులు అడ్డుకుం టున్నారా? అనేది తెలియడం లేదన్నారు. ఇదే విషయంపై త్వరలోనే సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్తామని, అయినప్పటికీ లబ్ధిదారులకు న్యాయం జరగకపోతే స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద లబ్ధిదారులు, మద్దతుదారులతో నిరవధిక నిరాహార దీక్ష చేపడతానని ఆమె హెచ్చరించారు. ఈ సమావేశంలో వైసిపి సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు పాల్గొన్నారు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి

స్పటిక లింగాన్ని దర్శించుకున్న 'బూరుగుపల్లి'

స్పటిక లింగాన్ని దర్శించుకుంటున్న బూరుగుపల్లి

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని అన్నవరప్పాడులో ఉమా సోమేశ్వర స్వామి దేవస్థానం కోనేటిలో ఉన్న లింగాన్ని మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు శనివారం దర్శించుకున్నారు. గత నెల 27 నుంచి భక్తులకు దర్శనం చేసుకునే సదుపాయం దేవాలయం కల్పించింది. కార్తీక మాసం సందర్భంగా శనివారం స్పటిక లింగ దర్శనం కోసం చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.

పాఠశాలకు ఇన్వర్టర్ బ్యాటరీ అందజేత

ప్రజాశక్తి - కడియం

స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలకు ఆదే పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వర్తిస్తున్న జివివి నాగమణి ఇన్వర్టర్ బ్యాటరీని బహుకరించారు. ఉపాధ్యాయురాలు కుమార్తె పెళ్లి రోజును పురస్కరించుకుని పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌కు అవసరమైన రూ.10 వేలు విలువ చేసే బ్యాటరీని పాఠశాల హెచ్ఎం టి.సత్య నారాయణకు శనివారం అందచేశారు. ఈ సందర్భం గా హెచ్ఎం సత్యనారాయణ మట్లాడుతూ తన కుమార్తె వివాహ దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ఉపయోగపడేలా ఉపాధ్యాయురాలు నాగమణి తీసుకున్న నిర్ణయం అభినందనీయమని అన్నారు. కంప్యూటర్ ల్యాబ్‌లో ఇన్వెటర్‌కు అవసరమైన బ్యాటరీని అందించడం పట్ల పలువురు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు నాగమణిని తోటి ఉపాధ్యాయులు ప్రసాద్, శ్రీనివాస్, సువర్ణవేణి, అక్షయ, లీలావతి, ఫ్లోరెన్స్ తదితరులు అభినందించారు.



హెచ్ఎంకు బ్యాటరీని అందిస్తున్న ఉపాధ్యాయురాలు నాగమణి

క్రీడాస్ఫూర్తిని నింపేందుకే 'ఆడుదాం ఆంధ్ర'

ప్రజాశక్తి - ఉంగ్రాజవరం

యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆడుదాం-ఆంధ్ర కిట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 5 గేములకు సంబంధించిన ఆటల పోటీలకు సంబంధించిన స్పోర్ట్స్ మెటీరియల్, స్పోర్ట్స్ కిట్స్‌ను సచివాలయాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ జివిఎస్.రామకృష్ణంరాజు మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రఆటల పోటీల కార్యక్రమాన్ని నాయకులు, అధికారులు, సిబ్బంది అందరి సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. 13 వ తేదీ బుధవారం వరకు ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ జరుగుతుందని, 15 సంవత్సరాలు దాటిన ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు సిహెచ్.సక్సేనా రాజు, శారదా జోత్స్న, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా కిట్లను పంపిణీచేస్తున్న ఎంపిపి యల్లారీశ్వరి

CHANGE OF NAME

I, undersigned **MOHAMMED AKBAR (Old Name) S/o AHMAD HUSSAIN (Late),** Aged 72 Years, Resident of D.No.2-13-16, Santhi Nagar, Nidadavole-534 301, A.P. Changing my name form MOHAMMED AKBAR (Old Name) to **MOHAMMAD AKBAR** (New Name) hence forth I am being called as **MOHAMMAD AKBAR** (New Name) for all purposes.

CHANGE OF NAME

I, undersigned **FATHIMUNNISA MOHAMMED(Old Name) W/o MOHAMMAD AKBAR,** Aged 68 Years, Resident of D.No.2-13-16, Santhi Nagar, Nidadavole-534 301, A.P. Changing my name form FATHIMUNNISA MOHAMMED (Old Name) to **FATIMUNNISA** (New Name) hence forth I am being called as **FATIMUNNISA** (New Name) for all purposes.

బిసిల సంక్షేమానికి ప్రాధాన్యం

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపిలు భరత్, బోస్

ప్రజాశక్తి - కడియం

రాష్ట్రంలో బిసి సంక్షేమానికి సిఎం జగన్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎంపి మార్గాని భరత్ రామ్ అన్నారు. మండలంలోని వేమగిరి హైవే పక్కన 40 సెంట్ల స్థలంలో కోటి రూపాయల వ్యయంతో నిర్మించబోయే కమ్యూనిటీ హాల్‌కు ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి పక్కన ఎంతో విలువైన ప్రభుత్వ స్థలం బిసిల కమ్యూనిటీ హాల్ కొరకు కేటాయించడం సాధారణ విషయం కాదని, రాష్ట్రంలోనే నేషనల్ హైవే పక్కన ఇంత పెద్ద కమ్యూనిటీ హాల్ ఇప్పటి వరకూ ఇదేనని అన్నారు. మొదటి దశలో రూ.50 లక్షలతో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి, ప్రారంభోత్సవం కూడా వెనువెంటనే చేసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాస్ చంద్రబోస్, డిసిసిబి ఛైర్మన్ ఆకుల వీర్రాజు, నాయకులు పాలిక శ్రీనివాస్, దొంతంశెట్టి భద్రయ్య, ఈలి గోపాలం, కొండపల్లి పట్టియ్య తదితరులు పాల్గొన్నారు.

జర్నలిజానికి జీవనాడి 'నార్ల'

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తెలుగు జర్నలిజాన్ని ప్రపంచ స్థాయికి చేర్చిన భావ విప్లవకారుడు నార్ల వెంకటేశ్వరరావు అని పలువురు సాహితీప్రియులు కొనియాడారు. ప్రజ్ఞా సాహితీ ఆధ్వర్యంలో నార్ల 116వ జయంతిని శనివారం నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ పుల్లెపు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాజపత్ర ప్రధానోపాధ్యాయులు వీధి.సురేష్‌బాబు మాట్లాడారు. పత్రికా సంపాదకుడిగా, సాహితీ వేత్తగా, పరిశోధకుడిగా, హేతువాద భావజాలకుడిగా చరిత్రలో నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాసాహితీ గౌరవ అధ్యక్షుడు వి.వరప్రసాదరావు, డి.నారాయణ రావు, ఎఎస్ఎస్ఎన్. మూర్తి, కె.మహేష్, వి.లక్ష్మీనారాయణ, పి.సత్తిబాబు, జె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అప్పుల ఊబిలోకి నెట్టిన వైసిపి ప్రభుత్వం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వైసిపి ప్రభుత్వం అప్పుల ఊబిలోకి నెట్టిందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన పార్టీ అర్బన్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ అత్తిలి సత్యనారాయణ అన్నారు. టిడిపి, జనసేన కూటమి నేతత్వంలో స్థానిక 35వ డివిజన్లో స్థానిక టిడిపి నాయకులు కరగాని వేణు ఆధ్వర్యంలో టిడిపి నగర అధ్యక్షులు రెడ్డి మణేశ్వరరావు పర్యవేక్షణలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వ పాలన వైఫల్యాలతో కూడిన కరపత్రాలతోపాటు, టిడిపి-జనసేన మినీ మ్యేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 సార్వత్రిక ఎన్నికల్లో జగన్ ఇచ్చిన హామీలు నీట మూటలే అయ్యాని అన్నారు. మద్యపానం నిషేధమన్నారని, కాని నేడు వాడ వాడలా మద్యం దుకాణాలు వెలిశాయని, అదే విధంగా సందు సందుకు బెల్టు షాపులు దర్శినమిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నక్కెళ్ల హరి, కరగాని ఆనంద్, నరేంద్ర, సతీష్, ఉమా, బేబీ, కర్రి శ్రీను పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

విధి నిర్వహణలో ప్రణాళికా బద్ధంగా బాధ్యతలు నిర్వహించని వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం హెచ్చరించారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జిల్లాలోని 19 మండలాల ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్ఎంలతో శనివారం ప్రత్యేక సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాడు-నేడు, టోఫెల్ పరీక్ష, మధ్యాహ్న భోజన పథకం, జెవికె కిట్స్, సబ్జెక్టు ఉపాధ్యాయులు తదితర అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. అన్ని పాఠశాలకు సబ్జెక్టు టీచర్లను అందజేయడం జరిగిందని, సంబంధిత సబ్జెక్టు టీచర్ మాత్రమే ఆ సబ్జెక్టును బోధించాలని లేకపోతేకఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఇఒ ఇవిబిఎన్.నారాయణ, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ

PUBLICATION

In the Court of the Hon'ble Senior Civil Judge, Amalapuram

O.P. No. 174 of 2022

Between:

Padala Srisatya, W/o. Srinivasa Reddy, D.No. 2-5-37, Sri Ganesh Gas & General Stores, Sitapathiraopeta, Amalapuram, Dr. B.R.Ambedkar Konaseema Dist.,

...Petitioner

Vs

Budda Lakshmi Amrutha, Pujitha Hospital, Panta Kalva Road, NTR Circle, Near Saptagari Bank, Patamata, Benz Circle, Vijayawada - 520010, NTR Dist.,

...2nd Respondent

The above named petitioner has instituted the above petition against you, and the same stands posted to **14-12-2023 at 10.30 A.M** for your appearance. You are hereby required to appear personally or through advocate attend before this Hon'ble Court at 10.30 AM and file your objections if any, failing which the matter will be heard and determined in your absence exparte as per law.

//By the orders of the Hon'ble Court//

D.V.V.S.MURTHY

Amalapuram — Advocate, Amalapuram

Dt. 30-11-2023 — Cell: 9848344577

In the Court of the IIIrd Additional District Judge at Kakinada

A.S. No. 40/2023

Between:

Allu Veera Venkata Srinivasa Rao

...Appellant/ Defendant

AND

Kesavarapu Venkateswara Rao

...Respondent/ Plaintiff

To:

Kesavarapu Venkateswara Rao, S/o. Mallikarjuna Rao, aged 59 years, Business, R/o. D.No. 1-B, Satyadurga Nagar, Turangi, Kakinada. ***...Respondent***

పై నెంబరు అప్పీలు దావాలో రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకొనకుండా తప్పించుకుని తిరుగుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 11-12-2023వ తేదీకి వాయిదా వేసినారు.. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై అప్పీలు దావాను మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

G.DIVYA SREE VIDYA

D/o. G.PAIDARAO, Advocates

Kakinada, Cell: 9246699297

ఏకగ్రీవం దిశగా ఫిషర్మెన్ సొసైటీ ఎన్నిక

ప్రజాశక్తి - కడియం

మండలంలోని జేగురుపాడు గ్రామానికి చెందిన ఫిషర్మెన్ కోపరేటివ్ సొసైటీ ఎన్నికలు ఏకగ్రీవం దిశగా అడుగులు వేస్తున్నాయి. ఈ నెల 5న జరిగే ఎన్నికలకు సంబంధించి శనివారం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అయ్యింది. అయితే గ్రామ సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ బలపరిచిన అభ్యర్థులు మాత్రమే నామినేషన్లు వేశారు. దీంతో సొసైటీ ఎన్నికల ఏకగ్రీవం అయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. గత ఏడాది ఎన్నికలు జరగాల్సి ఉండగా కోర్టు ఉత్తర్వులతో సొసైటీ ఎన్నికలు నిలిచిపోయాయి. ఎట్టకేలకు కోర్టు అడ్డంకులు తొలగిపోవడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మత్స్యశాఖ అధికారులు ఎన్నికల నిర్వాహణకు సమాయత్తం అయ్యారు. దీనిలోభాగంగా సొసైటీకి సంబంధించి 8 డైరెక్టర్ పదవులకు నామినేషన్లను స్వీకరించారు. వీటికి అదనంగా మరెవ్వరూ నామినేషన్లు వేయకపోవడంతో పాలకవర్గం ఎన్నిక ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉంది. అధికారికంగా మత్స్య శాఖ అధికారులు ప్రకటించాల్సివుంది.

బూత్ పరిధిలో కొత్త ఓటర్లను నమోదు చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

బిఎల్ఓలు తమకు కేటాయించిన బూత్ పరిధిలో కొత్త ఓటర్లను నమోదు చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్ అన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన నగరంలోని పోలింగ్ బూత్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కొత్త ఓటర్ల నమోదు, మార్పులు చేర్పులు మరియు తొలగింపులకై చేపట్టిన స్పెషల్ క్యాంపెయిన్‌ను వినియోగించుకోవాలని కోరారు. సచివాలయ ఎడ్యుకేషన్ కార్యదర్శులు అందించిన జాబితా ప్రకారం యువతీ / యువకులను సంప్రదించి వారికి ఓటు ఉంటే ఎపిక్ నెంబర్ పుస్తకంలో నమోదు చేయాలని, లేనిపక్షంలో వెంటనే ఓటరుగా నమోదు చేయాలని, అలాగే చనిపోయిన వ్యక్తులు, నగరాన్ని వదిలి యితర ప్రాంతాలకు వెళ్లిన వారుని గుర్తిస్తే తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో సీతంపేట టింబర్ మర్చంట్ హాలు, లిస్టర్ పేట స్కూలు, అద్దేపల్లి మహాలక్ష్మి కాలేజి, దానవాయిపేట మున్సిపల్ ఎలిమెంటరీ స్కూలు, రామదాసు కో-ఆపరేటివ్ బిల్డింగ్ మరియు డి.ఎం.హెచ్. స్కూలు తదితర ప్రాంతాలలోని పోలింగ్ బూత్ లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి కమిషనర్, జి.సాంబశివరావు, తహశీల్దార్ సుస్వాగతం, ఎలక్షన్ డిటి. పవన్ కుమార్ పాల్గొన్నారు.

సిబ్బందిని ప్రశ్నిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

వేలం ప్రకటన

మహారాజశ్రీ పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P. 32/2018 in **O.S. 119/2016**

Between:

శీరం రాజశేఖర్ ***...DHR***

మరియు

శీరం లక్ష్మినారాయణ ***...JDR***

పై నెంబరు అమలులో ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని **ది. 18-12-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట బహిరంగ వేలం వేయబడును. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొని పాడుకొనవలసిందిగా తెలియ జేయడమైనది. వివరములు కోర్టు వారు శ్రీ కోర్టు వారి నజారత్‌లో గాని, DHR అడ్వకేట్ గారి ఆఫీసులో గాని తెలుసుకోవలెను.

షెడ్యూలు: తూర్పుగోదావరి జిల్లా, పిఠాపురం సబ్-రిజిష్ట్రి, పిఠాపురం మునిసిపాలిటీ, పిఠాపురం 3వ వార్డులో 164 చదరపు గజముల విస్తీర్ణంగా గల D.No. 3-2-27/C/1 RCC డాబా ఇంటికి హద్దులు. **తూర్పు:** దండి జ్యోతి గారి ఇల్లు. **దక్షిణం:** శీరం గోపాలకృష్ణ గారి ఇల్లు మరియు స్థలం. **పడమర:** రోడ్డు. **ఉత్తరం:** శీరం నాగ సత్యనారాయణ గారి ఖాళీ స్థలం.

పై హద్దుల మధ్యస్తమయిన ఆర్‌సిసి డాబా ఇల్లు, అందలి దారి మార్గములు, నీటి వనరులు మరియు ఎలక్ట్రికల్ ఫిటింగులు సమస్త యూజుమెంటు హక్కులతో సహా వేలం వేయబడును.

అమీన విలువ: రూ. 25,00,000=00

D.Hr విలువ: రూ. 12,00,000=00

శ్రీ పడాల రవి

పిఠాపురం — **శ్రీ యాళ్ళ బదరీనారాయణమూర్తి**

ది.29-11-2023 — అడ్వకేట్స్, పిఠాపురం

ప్రకటన

మహారాజశ్రీ కాకినాడ 5వ అదనపు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

O.S. No. 848/2023

Between:

ముప్పిడి సూర్యావతి అనే భానుమతి ...వాది

మరియు

1) **చోడిశెట్టి కామేశ్వరి,** W/o.(లేటు) రామారావు, డో.నెం.13-4-34, చలికివారి వీధి, సామర్లకోట, కాకినాడ జిల్లా.
2) **చోడిశెట్టి ప్రసాద్,** S/o. (లేటు) రామారావు, డో.నెం.13-4-34, చలికివారి వీధి, సామర్లకోట, కాకినాడ జిల్లా.
3) **చోడిశెట్టి అచ్చిరాజు,** S/o. (లేటు) రామారావు, డో.నెం.13-4-34, చలికివారి వీధి, సామర్లకోట, కాకినాడ జిల్లా.
4) **చోడిశెట్టి పాపారావు,** S/o.(లేటు) రామారావు, డో.నెం. 13-4-34, చలికివారి వీధి, సామర్లకోట, కాకినాడ జిల్లా.

...ప్రతివాదులు

పై నెంబరు దావాలో 1 నుండి 4 ప్రతివాదులకు శ్రీ కోర్టువారి నుండి ఎన్నిసార్లు సమన్లు పంపించిననూ తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున, సదరు 1 నుండి 4 ప్రతివాదులు **ది. 22-12-2023 సం॥రం తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** స్వయంగా గానీ, ప్లీడరు గారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపగలరు. లేని యెడల పై నెంబరు దావా మీ పరోక్షంలో శ్రీ కోర్టువారు తగు చర్యలు గైకొనగలరు.

N.V.హయగ్రీవరావు, అడ్వకేట్

డో.నెం. 21-1-7, సాలిపేట

కాకినాడ. ది.02-12-2023 — కాకినాడ. సెల్: 98495 99091

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని కొత్తపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న జగనన్న ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని గోకవరం మండల ప్రత్యేక అధికారిని జగదాంబ అన్నారు. శనివారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా జనవరి నెలాఖరుకి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ఆడుదాం ఆంధ్రకు క్రీడ మహోత్సవంలో భాగంగా కామరాజుపేట హైస్కూల్ మైదానాన్ని పరిశీలించారు. అనంతరం అచ్చుతాపురం గ్రామంలో చెరువులలో పూడికతీత పనులను పరిశీలించారు. ఉపాధి కూలీలు ప్రతి ఒక్కరికి రోజుకి రూ.272 వేతనం వచ్చే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.పద్మజ్యోతి, ఎఒ కిషోర్ కుమార్, ఎపిఒ పిఎస్.అప్పలరాజు, పంచాయతీ సెక్రటరీ సిహెచ్.చిన్నకుమార్ రెడ్డి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతంగా ఫేబ్రిక్స్ క్రాఫ్ట్స్ వర్క్‌షాప్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో మూడు రోజులపాటు నిర్వహించిన ఫేబ్రిక్ క్రాఫ్ట్స్ వర్క్ షాప్ విజయవంతం అయ్యింది. లలిత కళల విభాగం స్కిల్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో పిడిలైట్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. డిగ్రీ, ఫిజి విద్యార్థులు తమలో నిద్రాణంగా ఉన్న కళను, సృజనాత్మకను అరుణ శిక్షణలో వెలికితీసి రంగులు జోడించి తెల్లని వస్త్రంపై ఆవిష్కరించారు. వర్క్షాప్ ముగింపు సభలో ప్రిన్సిపల్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ నైపుణ్య శిక్షణలో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలపెప్పుడూ ముందుంటుందన్నారు. జాతీయ విద్యావిధానం -2020లో నైపుణ్య శిక్షణ అంతర్భాగమని, ప్రతి కళాశాల. నైపుణ్య శిక్షణలు ఇవ్వాలని, అందులో భాగంగానే ఫేబ్రిక్స్ క్రాఫ్ట్స్ వర్కుషాపు నిర్వహించినట్లు తెలిపారు. ఈ వర్క్‌షాప్‌ను వినియోగించుకున్న విద్యార్థులు, శిక్షణ ఇచ్చిన ట్రైనర్ల,ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక సేవలు అందించిన లెక్చరర్ సరోజ, డాక్టర్ రాణి, సిబ్బంది సునీల, శ్యామలలను ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో స్కిల్ ట్రైనింగ్ సెంటర్ టి.వెంకట్రావు, లెక్చరర్ సంజీవరావు, లలిత కళల విభాగం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శిక్షణలో నేర్చుకున్న చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు